సాక్షి
విజయనగరం

శుక్రవారం | 31 | మే | 2024



జిందాల్ కార్మికులకు సంఘీభావం

కొత్తవలస మండలం అప్పన్నపాలెం గ్రామ సమీపంలోని జిందాల్ కర్మాగారం కార్మికులకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు. - 8లో



కొండపేటలో హైనా..!

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని కొండపేటలో హైనా(దుమ్మలగొండు) గురువారం సంచరించింది. - 8లో



పోషకాల రేడు.. నేరేడు

ప్రకృతి ప్రసాదించే పండ్ల జాతుల్లో ఆరోగ్య ఫల ప్రదాయనిగా పిలిచే నేరేడు పండును సక్రమంగా వినియోగిస్తే ఆరోగ్యం సిద్ధిస్తుంది. - 8లో

న్యూస్‌రీల్

కౌంటింగ్ ఏజెంట్లకు మార్గదర్శకాలు ఇవే..



కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఓట్ల లెక్కింపులో అభ్యర్థుల తరఫున ఉండే కౌంటింగ్ ఏజెంట్ల విధివిధానాలపై ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు విడుదల చేసింది. అభ్యర్థులు తమ ప్రతినిధులుగా నియమించుకునే ఏజెంట్ల నియామకానికి కౌంటింగ్‌కు మూడు రోజుల ముందు సాయంత్రం 5 గంటల్లోపు సంబంధిత రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ)కి ఫారం-18 సమర్పించాలి. వాటికి ఆమోదం లభించిన అనంతరం కౌంటింగ్ ఏజెంట్లకు ఆర్‌ఓలు ఐడీ కార్డులు పంపిస్తారు. వారు కౌంటింగ్‌కు గంట ముందు అపాయింట్‌మెంట్ లెటర్, ఐడీ కార్డులను ఆర్వోలకు సమర్పించాల్సి ఉంటుంది. ఏదైనా కారణంతో ఏజెంట్ల నియామకాన్ని రద్దు చేసి, కొత్త వారిని నియమించుకునే అవకాశం అభ్యర్థికి ఉంటుంది. ఆ విధుల నుంచి తప్పుకునే అవకాశం ఏజెంట్లకు కూడా ఉంటుంది.

మార్గదర్శకాలు ఇవే...

- ఏజెంట్లుగా 18 సంవత్సరాలు నిండిన వారిని నియమించుకోవచ్చు. వారికి ఈవీఎంలు, వీవీప్యాట్లు పని చేసే విధానం, పోస్టల్ బ్యాలెట్ వంటి వాటిపై అవగాహన ఉండాలి.
- సాయుధ రక్షణ ఉన్నవారిని కౌంటింగ్ హాలులోకి అనుమతించరు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మేయర్లు, మున్సిపల్, జెడ్పీ చైర్మన్లు, ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్ల చైర్మన్లు ఏజెంట్లుగా అనర్హులు. అభ్యర్థి తనకున్న సాయుధ రక్షణకు స్వచ్ఛందంగా వదులుకుంటే కౌంటింగ్ హాలులో కూర్చొనేందుకు అనుమతిస్తారు.
- ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం పొందే వారు, ప్రభుత్వ, ఎయిడెడ్ ఉద్యోగులు, పారా మెడికల్ సిబ్బంది, అంగన్‌వాడీ ఉద్యోగులు ఏజెంట్లుగా ఉండరాదు. అలా ఉంటే ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం 3 నెలల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది.
- సర్పంచ్‌లు, పంచాయితీ వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, భారత పౌరసత్వం కలిగిన ఎన్‌ఆర్‌ఐలు కౌంటింగ్ ఏజెంట్లుగా ఉండవచ్చు.
- ప్రతి కౌంటింగ్ హాలులో ఈవీఎం, పోస్టల్ బ్యాలెట టేబుళ్లకు అనుగుణంగా అభ్యర్థులు తమ ఏజెంట్లను నియమించుకోవచ్చు.

కౌంటింగ్ కేంద్రంలోకి వీరికే అనుమతి

కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల సంఘం అనుమతి పొందిన వ్యక్తులు, పరిశీలకులు, ఎన్నికల విధులతో సంబంధం కలిగిన ఉద్యోగులు, పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లను మాత్రమే కౌంటింగ్ హాల్‌లోకి అనుమతిస్తారు. వీరికి నియోజకవర్గాల వారీగా గుర్తింపు కలర్ కోడ్ ఇస్తారు. దీనిపై రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు, ఏజెంట్లకు ఇప్పటికే అధికారులు అవగాహన కల్పించారు.

ఆన్‌లైన్ మూల్యాంకనంపై శిక్షణ

పార్వతీపురంటౌన్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష జవాబు పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనంపై పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ నెల 24 నుంచి జరుగుతున్న పరీక్షలు 31వ తేదీతో ముగుస్తాయి. జూన్ 1వ తేదీ నుంచి జవాబు పత్రాలను ఆన్‌లైన్ విధానంలో అధ్యాపకులు మూల్యాంకనం చేయనున్నారు. ఈ విధానంపై జిల్లాలోని ప్రభుత్వ, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, మోడల్ కాలేజ్, కేజీబీవీ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు చెందిన 275 మంది సిబ్బందికి జిల్లా వృత్తి విద్యాధికారి డి. మంజులవీణ అవగాహన కల్పించారు. ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా మూల్యాంకనం పూర్తిచేయాలని ఆమె సూచించారు.

మార్గం సుగమం



చిత్రంలో కనిపిస్తున్నది రాజాం మండలంలోని పొగిరి గ్రామం నుంచి శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం మండలం పెంట, నాగులవలస గ్రామాలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.1.30 కోట్ల పీఆర్ నిధులతో వేసిన రోడ్డు. మూడు కిలోమీటర్ల మేర నిర్మించిన బీటీ రోడ్డుతో రెండు మండలాలతో పాటు రెండు జిల్లాల్లోని (శ్రీకాకుళం-విజయనగరం) పలు గ్రామాల ప్రజలకు 'మార్గం' సుగమమైంది. పొగిరి గ్రామం నుంచి పెంట గ్రామం మీదుగా సంతకవిటి మండలంలోని లింగాపురం, మామిడిపల్లి, మోదుగులపేట, పుల్లిట, గోవిందపురం, మందరాడ, చిన్నయ్యపేట, సురవరం గ్రామాలకు, రాజాం మండలంలోని వీఆర్ అగ్రహారం గ్రామానికి దారి దగ్గరైందని ఈ ప్రాంతీయులు సంతోషపడుతున్నారు. – రాజాం

తల్లిపాలే బిడ్డకు రక్ష



తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరం. శిశువు జన్మించిన నుంచి తల్లిపాలు పెట్టడం వల్ల ఆరోగ్యకరంగా ఎదుగుతారు.. ఎలాంటి ఆరోగ్య సమస్యలు దరిచేరవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ అన్నారు. రేగిడి మండలం లచ్చారాయపురం అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు గురువారం ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల సంరక్షణ బాధ్యతలను అంగన్‌వాడీ కార్యకర్తలు కె.నాగమణి, హేమలత, కళావతమ్మ వివరించారు. – రేగిడి

జీవన చిత్రం



వేసవి కాలంలో విరివిగా లభించే తాటి కాయల అమ్మకమే గీత కార్మికులకు జీవనాధారం. దీనికోసం ఇంటిల్లిపాదీ శ్రమిస్తారు. పొలాల్లో ఉన్న తాటిచెట్ల నుంచి ఉదయాన్నే కాయలు సేకరిస్తారు. వాటి నుంచి ముంజులుతీసి ప్రధాన కూడళ్లలో విక్రయిస్తారు. విజయనగరం ట్యాంక్ బండ్ రోడ్డులో ఆలుమగలు తాటి ముంజుల అమ్మకంలో నిమగ్నంకాగా.. పాఠశాలలకు సెలవు కావడంతో తల్లిదండ్రుల చెంతనే సేద తీరుతున్న పిల్లలను చిత్రంలో చూడొచ్చు.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

కొత్త వరి వంగడాలతో.. రైతన్నకు సిరి



జిల్లాలోని రైతన్నలకు సిరులు కురిపించే వరి వంగడాల సాగును వ్యవసాయ యంత్రాంగం ప్రోత్సహిస్తోంది. చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే సరికొత్త వరి వంగడాలను రైతులకు అందుబాటులోకి తెచ్చింది. సాగు పద్ధతులను వివరిస్తోంది. ఏ నేలకు ఏ రకం మంచిదో తెలియజేస్తోంది. సాంబ, స్వర్ణ రకాలకు ప్రత్యామ్నాయంగా ఎంటీయూ-1224, 1318 రకాలను సాగుచేయాలని సూచిస్తోంది.

- సాంబ, స్వర్ణ రకాలకు ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1224, 1318 రకాల సాగుకు ప్రోత్సాహం
- 1224 రకం తినడానికి అనువైనది
- చీడపీడలు తట్టుకుంటుందంటున్న వ్యవసాయ అధికారులు
- ఇప్పటికే జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సాగు
- ఆశాజనకంగా దిగుబడులు
- ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో సాగుకు వీలుగా 4,076 క్వింటాళ్ల విత్తనాల కేటాయింపు

విజయనగరం ఫోర్ట్: ఖరీఫ్ సీజన్‌కు సమయం ఆసన్నమైంది. నైరు రుతుపవనాల ఆగమనంతో మరి కొద్ది రోజుల్లో వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సూచనలతో జిల్లాలోని రైతన్నలు వరి సాగుకు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే అడపాదడపా కురుస్తున్న వర్షాలకు నారుమడులు, వెద పొలాలను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను వ్యవసాయ శాఖ సిద్ధం చేస్తోంది. ఇప్పటికే ఆర్‌బీకేల్లో విత్తనాలను నిల్వ చేసింది. ఈ ఏడాది కొత్త వరి వంగడాల సాగును ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో సాగుచేయించి, అధిక దిగుబడులు రావడంతో జిల్లాలోని రైతులందరూ ఆ రకాలను సాగుచేసేలా ప్రోత్సహిస్తోంది. దీనికోసం ఊరూరా రైతులతో సమావేశాలు ఏర్పాటుచేసి కొత్త వరి వంగడాలను పరిచయం చేస్తోంది. సాగువల్ల కలిగే లాభాలను, పంట కాలాన్ని వివరిస్తోంది.

వరి సాగే జీవనాధారం

జిల్లాలో సాగయ్యే పంటల్లో వరి సాగుదే అగ్రస్థానం. అత్యధికంగా 90,058 వేల హెక్టార్లలో ఏటా సాగవుతోంది. దీనికి అనుగుణంగా వ్యవసాయ శాఖ విత్తన కేటాయింపులు చేస్తోంది. ఇప్పటికే ఎంటీయూ 1121 రకం విత్తనాలను రైతుభరోసా కేంద్రాలకు సరఫరా చేసింది. సాంబమసూరికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ--1224 రకం, స్వర్ణకు బదులుగా ఎంటీయూ-1318 రకం వంగడాలు సాగుచేయాలని రైతులకు సూచిస్తోంది. ఈ రెండు రకాలకు సంబంధించి 4,076 క్వింటాళ్ల విత్తనాలను సిద్ధంచేసింది.

స్వర్ణకు సరిపోలేలా ఎంటీయూ 1318 రకం



స్వర్ణకు బదులు ఎంటీయూ 1318 రకాన్ని వేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. స్వర్ణ రకం 1982వ సంవత్సరం నుంచి సాగులో ఉంది. ఈ నేపథ్యంలో 1318 రకాన్ని వేయాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ రకం పంట కాలం 150 రోజులు. ఎకరానికి 30 బస్తాల దిగుబడి వస్తుంది.

తిండికి పనికొచ్చే ఎంటీయూ-1224 రకం



1224 రకం విత్తన ప్యాకెట్

సాంబమసూరి రకం వరికి తెగుళ్ల బెడద ఎక్కువ. ఇది 1986వ సంవత్సరం నుంచి సాగులో ఉంది. సుమారు నాలుగు దశాబ్దాలుగా సాగులో ఉండడంతో తెగుళ్ల తాకిడి ఎక్కువైంది. ఏటా రైతులు పంట నష్టపోతున్నారు. పంట చేతికి వచ్చే వరకు బెంగపడాల్సిన పరిస్థితి. దీనికి ప్రత్యామ్నాయంగా తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అధిక దిగుబడులు వస్తున్న ఎంటీయూ-1224 రకం సాగును వ్యవసాయ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. గత రెండేళ్లుగా జిల్లాలోని కొన్ని మండలాల్లో కొందరు రైతులు సాగు చేశారు. ఎకరాకు 25 బస్తాల దిగుబడి సాధించారు. ఇది సన్నని రకం. తినడానికి అనువుగా ఉంటుంది. ఈ పంట కాలం 135 రోజులు. చీడపీడలను తట్టుకుంటుంది. గాలులకు చేను పడిపోదు. దోమపోటు రాదు. ధర కూడా సాంబ రకంతో సమానం. జిల్లాలోని నేలలు ఈ రకం సాగుకు అనువైనవని అధికారులు చెబుతున్నారు.

చౌడు నేలలకు ఎంసీఎం 103 రకం అనుకూలం



ఈ రకం సన్నని రకం. చౌడు నేలల్లో కూడా బాగా పండుతుంది. దీని పంట కాలం 140 రోజులు. నేరుగా గాని, దమ్ము చేసి నాట్లు కూడా వేసుకోవచ్చు. ఎకరానికి 30 బస్తాలు దిగుబడి వస్తుంది.

పంట కలిసొచ్చేలా..

రైతులకు వరి పంట కలిసొచ్చేలా ఈ ఏడాది ఖరీఫ్‌లో ఎంటీయూ-1224, ఎంటీయూ 1318 రకాల సాగును ప్రోత్సహిస్తున్నాం. ఇప్పటికే మండల వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. విత్తనాలను కూడా కేటాయించాం. సాంబమసూరి, స్వర్ణ రకాలకు ప్రత్యామ్నాయంగా వీటిని రైతులు సాగుచేసుకోవాలి. అధిక దిగుబడులతో పాటు గిట్టుబాటు ధర లభిస్తుంది.

– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

ఔను.. చెరువును పంచుకున్నారు!



ఆనందరాజు చెరువు వద్ద రైతుల ఆందోళన

ఔను.. సాగునీటి చెరువును కొందరు పంచుకున్నారు. వారికి రిజిస్ట్రేషన్, రెవెన్యూశాఖ అధికారులు సహకరించారు. ఏకంగా సాగునీటికి ఆధారమైన చెరువును కొందరి పేరున రిజిస్ట్రేషన్ చేసేశారు. ఇది తెలిసిన రైతులు లబోదిబోమంటూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం చెరువు అక్రమ రిజిస్ట్రేషన్లు తేల్చే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది.

- సాగునీటికి ఆధారమైన చెరువు రిజిస్ట్రేషన్‌పై రైతుల ఆందోళన
- రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు
- అంతా రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల కనుసన్నల్లోనే జరిగిందంటూ ఆరోపణ

డెంకాడ: విజయనగరం-కుమిలి రోడ్డులో డెంకాడ మండలం గుణుపూరుపేట పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 60-3లో 22.24 ఎకరాల విస్తీర్ణంలో ఆనంద చెరువు విస్తరించి ఉంది. 30 ఎకరాల ఆయకట్టులో పంటల సాగుకు ఈ చెరువు నీరే ఆధారం. ఇది రోడ్డు పక్కనే ఉండడంతో ఎకరా ధర సుమారు రూ.3కోట్ల నుంచి రూ.4కోట్లు పలుకుతోంది. అంతే.. దీనిపై కొందరు అక్రమార్కుల కన్నుపడింది. చెరువును కబ్జా చేసేందుకు లొసుగులు వెతికారు. వీరికి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సహకరించారు. అంతే.. గుట్టుచప్పుడుగా చెరువు గర్భంలోని 14.50 ఎకరాలను కొందరు పంచుకున్నారు. హద్దులు నిర్ణయిస్తూ వారి పేరున రిజిస్ట్రేషన్ పత్రాలు కూడా సిద్ధమయ్యాయి. ఈ తతంగమంతా భోగాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగినట్టు సమాచారం. ఇది తెలిసిన రైతులు లబోదిబోమంటున్నారు. 30 ఎకరాల సాగు భూమికి చెరువు నీరే ఆధారమని, తాత ముత్తాతల నుంచి ఉన్న చెరువును పంచుకోవడమేమిటంటూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువులో సాగునీరు నిల్వ ఉండేలా ఏటా



గుణుపూరుపేటలో ఉన్న ఆనందరాజు చెరువు ఇదే..

ఉపాధిహామీ పనులు కూడా చేస్తున్నామని తెలిపారు. రెవెన్యూ రికార్డులు మార్చేసి సాగునీటి చెరువును కొందరు సొంతం చేసుకోవాలని చూస్తున్నారని, అన్యాయాన్ని అడ్డుకోవాలని విన్నవించారు. దీనిపై రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. చెరువును గురువారం పరిశీలించింది. మొత్తం వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


కలెక్టర్‌కు నివేదిక..



ఆనందరాజు చెరువును పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

గుణుపూరుపేట పంచాయతీ పరిధిలోని ఉన్న ఆనందరాజు చెరువు వివాదంపై కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి, జేసీ కార్తీక్‌కు నివేదిక అందజేస్తామని తహసీల్దార్ రామారావు తెలిపారు. ఆనందరాజు చెరువు వద్దకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది వెళ్లి అక్కడ భూస్థితిని పరిశీలించారన్నారు. ఇది జిరాయితీ చెరువు అని, రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయన్నది తెలియాల్సి ఉందన్నారు.

నిబంధనల ప్రకారం ఓట్ల లెక్కింపు



జేసీ కె.కార్తీక్

విజయనగరం అర్బన్: విజయనగరం, బొబ్బిలి నియోజక వర్గాలు, విజయనగరం పార్లమెంట్ సెగ్మెంట్‌కు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ జేఎన్‌టీయూ జీవీలో జూన్ 4వ తేదీన ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని జేసీ, విజయనగరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.కార్తీక్ తెలిపారు. జేఎన్‌టీయూ జీవీలో జరిగే ఓట్ల లెక్కింపు సిబ్బందికి కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సిబ్బంది ఉదయం 6 గంటలకే కౌంటింగ్ కేంద్రంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరుగుతుందని, అరగంట తర్వాత ఈవీఎంల లెక్కింపు ప్రారంభమవుతుందని చెప్పారు. లెక్కింపు పూర్తయ్యే వరకు టేబుల్ వద్ద నుంచి సిబ్బంది వెళ్లకూడదన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంలలో ఓట్ల కౌంటింగ్‌కు వేర్వేరుగా ఏర్పాట్లు చేశామన్నారు. విజయనగరం పార్లమెంట్‌కు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియ లెండి ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతుందని స్పష్టంచేశారు. ఓట్ల లెక్కింపులో ప్రధానంగా గోప్యత పాటించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌లో ఓటరు వివరాలను వెలువరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈవీఎంల కౌంటింగ్ కోసం ప్రతి టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్ (గెజిటెడ్), ఒక కౌంటింగ్ అసిస్టెంట్, కౌంటింగ్ స్టాఫ్ ఒకరు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని, అలాగే, ప్రతి టేబుల్ వద్ద పోస్టల్ బ్యాలెట్ కోసం ఒక సహాయ రిటర్నింగ్ అధికారి, ఒక కౌంటింగ్ సూపర్ వైజర్ (గెజిటెడ్), ఇద్దరు కౌంటింగ్ అధికారులు (గెజిటెడ్), ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని తెలిపారు. ఈటీపీబీఎస్‌కు సంబంధించి ప్రతి టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఒక అసిస్టెంట్, ఒక ఏఆర్‌ఓ ఉంటారన్నారు. అభ్యర్థులు, లేదా వారి ఏజెంట్లను కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు అనుమతి పత్రం ఉన్నవారిని మాత్రమే ఆర్వో అనుమతిస్తారని చెప్పారు. ఈవీఎం ఓట్ల లెక్కింపు కేంద్రానికి, పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలకు వెళ్లేందుకు ఏజెంట్లకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశామని చెప్పారు. అసెంబ్లీ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో కేంద్రంలో నాలుగు టేబుళ్లను ఏర్పాటు చేసినట్టు వివరించారు. పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం 20 టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. ఈవీఎంల ఓట్ల లెక్కింపు కేంద్రంలో వరుసకు ఏడు చొప్పున మొత్తం 14 టేబుళ్ల అమర్చామన్నారు. ఏయే బ్లాక్‌లలో ఏయే నియోజకవర్గాల లెక్కింపు జరుగుతుందో అందరికీ తెలిసేలా సైన్‌బోర్డులను ఏర్పాటుచేశామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లేందుకు అనుమతి ఉండదని, ఏజెంట్లు పెన్ను, పెన్సిల్, 17-సీ ఫారం, తెల్లకాగితం మాత్రమే వారితో తీసుకురావాలన్నారు. సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.



హాజరైన సహాయ రిటర్నింగ్ అధికారులు

క్లుప్తంగా

మైనర్లు వాహనం నడిపితే రూ.25 వేల జరిమానా


జిల్లా రవాణా శాఖాధికారి మల్లికార్జునరెడ్డి

పార్వతీపురంటౌన్: మైనర్లు వాహనాలు నడిపితే రూ.25 వేలు జరిమానా విధించనున్నట్లు జిల్లా రవాణా శాఖాధికారి మల్లికార్జున రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రవాణా శాఖ జూన్ 1 నుంచి కొత్త నిబంధనలు ప్రవేశపెడుతోందని, కొత్త ట్రాఫిక్ నిబంధనలు అమల్లోకి రావడంతో, భారీగా జరిమానాలు విధించనున్నామన్నారు. అతివేగంతో వాహనం నడుపుతూ పట్టుబడితే రూ. 1000 నుంచి రూ.2000 వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని, అలాగే లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.500 జరిమానా విధించనున్నట్లు పేర్కొన్నారు. మైనర్ వాహనం నడిపితే రూ.25వేలు అపరాధ రుసుం విధించడంతో పాటు మైనర్‌కు 25 ఏళ్ల వయసు వచ్చే వరకు డ్రైవింగ్ లైసెన్స్ పొందకుండా ఆంక్షలు విధించనున్నట్లు స్పష్టం చేశారు.

108 పైలెట్ రక్తదానం


రక్తదానం చేస్తున్న 108 పైలెట్ నారాయణరావు

విజయనగరం ఫోర్ట్: శస్త్రచికిత్స అవసరమైన మహిళకు 108 ఉద్యోగి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచాడు. పద్మనాభం మండలంలోని గెద్ద పేటకు చెందిన కె.సూర్యకాంతానికి రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిపోవడంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. అక్కడి వైద్యులు శస్త్రచికిత్స చేయాలని, అందుకోసం బిపాజిటివ్ గ్రూపు రక్తం ఒక ప్యాకెట్ ఎక్కించాలని చెప్పారు. దీంతో బంధువులు 108 లో పైలెట్‌గా పనిచేస్తున్న బి. నారాయణరావును ఆశ్రయించడంతో పట్టణంలోని ఎస్‌వీఎస్ బ్లడ్ బ్యాంక్‌కు గురువారం ఆయన వచ్చి రక్తదానం చేశాడు.

కొండపేటలో హైనా..!


కొండపేటలో సంచరించిన హైనా

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని కొండ పేటలో హైనా(దుమ్మలగొండు) గురువారం సంచరించింది. సమీపంలో ఉన్న కొండపై నుంచి దిగిన హైనా కొండపేట గ్రామంలో చొరబడింది. దీంతో భయభ్రాంతులకు గురైన స్థానికులు హైనాను బంధించి అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. సమాచారం మేరకు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి. అప్పలరాజు, డీఆర్‌ఓ కేవీఎస్ రాజు, ఎఫ్‌బీఓ రామారావు గ్రామానికి చేరుకుని బంధించిన హైనాను సమీపంలోని అడవిలో విడిచిపెట్టారు.

వెంకన్నను దర్శించుకున్న ఎంపీ బెల్లాన దంపతులు


తిరుమలలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ దంపతులు, ఎంపీపీ సుధారాణి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: కలియుగ వైకుంఠ దైవం తిరుమల వేంకటేశ్వరస్వామిని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, శ్రీదేవి దంపతులు గురువారం దర్శించుకున్నారు. నెల్లిమర్ల ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడుతో కలిసి శ్రీవారి దర్శనం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు వైఎస్సార్‌సీపీ సొంతం కావాలని, రాష్ట్రానికి మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని.. ఎప్పటిలాగే పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలవాలని శ్రీవారిని కోరుకున్నట్లు తెలిపారు. డెంకాడ పీఏసీఎస్ చైర్మన్ రొంగలి కనక సింహాచలం శ్రీవారిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹260	₹270

జిందాల్ కార్మికులకు సంఘీభావం

- కర్మాగారం ప్రతినిధులతో జెడ్పీచైర్మన్ చర్చలు
- బేషరతుగా కర్మాగారాన్ని తెరవాలని విజ్ఞప్తి


కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం గ్రామ సమీపంలో గల జిందాల్ స్టెయిన్‌లెస్‌స్టీల్ కర్మాగారంలో ముడిసరుకు కొరత కారణంగా 14 రోజుల క్రితం లేఆఫ్‌ను ప్రకటించి మూసివేసిన విషయం తెలిసిందే. కర్మాగారంలో శాశ్వత, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న 283 మంది కార్మికులు ఆ నాటి నుంచి కర్మాగారం మెయిన్ గేటువద్ద వంటావార్పు ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గురువారం ఆందోళన శిబిరం వద్దకు వచ్చి కార్మికులకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన కార్మికుల నుద్దేశించి మాట్లాడుతూ జిందాల్ కర్మాగారాన్ని ముడిసరుకు కొరత కారణంగా మూసివేయడం దురదృష్టకరమైన విషయమని, రాష్ట్రంలో కర్మాగారాలను నిలబెట్టుకునేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో రాయితీలు ఇచ్చి సహకరించారన్నారు. జిందాల్ కార్మికుల సమస్యను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శుక్రవారం మరోమారు యాజమాన్యంతో కార్మిక సంఘం జేఏసీ నాయకులు చర్చించనున్నారని ఈ చర్చలు సఫలీకృతం కావాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. కర్మాగారం మనుగడకు 20 రోజుల వేతనానికి పనిచేస్తామని కార్మికులు చెప్పడం విశేషమని ప్రశంసించారు. సమస్య పట్ల యాజమాన్యం సానుకూలంగా పరిష్కరించకపోతే వచ్చే నెల 4వ తేదీ తరువాత కార్మికులు, ప్రభుత్వం అధికారులు, యాజమాన్యం, పెద్దలతో చర్చించి కార్యాచరణ చేద్దామన్నారు.

బేషరతుగా కర్మాగారం తెరవాలి

అనంతరం యాజమాన్య ప్రతినిధులు యూనిట్ హెడ్ దినేష్ శర్మ, హెచ్‌ఆర్ డీజీఎం జె.గోపాలకృష్ణ, హెచ్‌పీ సింఘాల్‌తో కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబుతో కలిసి జెడ్పీ చైర్మన్ మజ్జీ శ్రీనివాస రావు చర్చించారు. కర్మగారం మూత పడడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కర్మాగారాన్ని బేషరతుగా తక్షణమే తెరవాలని కోరారు. కర్మాగారం నడిపేందుకు అవసరమైన సహకారం ప్రభుత్వం తరపున పూర్తిగా అందజేస్తామని హామీ ఇచ్చారు. పరిశ్రమ ప్రస్తుతం నడిపేందుకు యాజమాన్యానికి కొంత కష్టమైనా కార్మికులు, వారి కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని తెరవాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడి వాస్తవ పరిస్థితులను టాప్ మేనేజ్‌మెంట్‌కు సమగ్రంగా వివరించి కర్మాగారం తెరిపించే బాధ్యత మీదేనిని యాజమాన్యం ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కేవీ సూర్యనారాయణరాజు(పులిరాజు), ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, అప్పన్నపాలెం సర్పంచ్ కోన దేముడు, కొత్తవలస మేజర్‌పంచాయతీ సర్పంచ్ ఎం.రామస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు మదీన అప్పలరాం, మేలాస్త్రి అప్పారావు, పల్లా భీష్మ, కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిల్లా అప్పలరాజు, గాడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


యాజమాన్యం ప్రతినిధులతో చర్చిస్తున్న జెడ్పీ చైర్మన్, కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు నెక్కల నాయుడుబాబు

ఉదయం 6 గంటలకే..

లెక్కింపు కేంద్రాలకు చేరుకోవాలి


కౌంటింగ్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్డీఓ సాయిశ్రీ

- ఆర్డీఓ సాయిశ్రీ

బొబ్బిలి: కౌంటింగ్ సిబ్బంది జూన్ 4న ఉదయం 6 గంటల లోపు లెక్కింపు కేంద్రాలకు చేరుకోవాలని ఆర్డీఓ, బొబ్బిలి రిటర్నింగ్ ఆఫీసర్ ఎ.సాయిశ్రీ అన్నారు. ఈ మేరకు గురువారం ఆమె ఆర్డీఓ కార్యాలయంలో కౌంటింగ్ సిబ్బందికి ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. జిల్లాకేంద్రంలోని జేఎన్‌టీయూలో జరిగే కౌంటింగ్‌లో సిబ్బంది ఈసీ నిబంధనలకు లోబడి వ్యవహరించాలని చెప్పారు. శిక్షణలోని అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆకళింపు చేసుకోవాలని సూచించారు. శిక్షణ సిబ్బంది చెప్పిన అన్ని అంశాలనూ అవగాహన చేసుకోవాలని, సొంత నిర్ణయాలు సరికాదని హెచ్చరించారు. కౌంటింగ్‌కు హాజరయ్యే సిబ్బందికి ఇచ్చిన గుర్తింపు కార్డులు మాత్రమే తీసుకువెళ్లాలని, సెల్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధమని స్పష్టం చేశారు. మొదట 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభమవుతుందని, అనంతరం 8.30 గంటలకు ఈవీఎంల లెక్కింపు ప్రారంభమవుతుందని చెప్పారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌ల సీళ్లు తెరవడం, తిరిగివేయడంతో పాటు సిబ్బంది బాధ్యతలను మాస్టర్ ట్రైనర్లు తెలియజేశారు. ఏఆర్వోలు త్రినాథరావు నాయుడు, రాజారావు, సులోచనా రాణి, రాజ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, హెచ్‌డీటీ రెడ్డి సాయికృష్ణ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఆరునెలల జైలుశిక్ష

- చెక్‌బౌన్స్ కేసులో ముద్దాయిగా నిర్ధారణ
- నెలలో అసలు, వడ్డీ ఇవ్వకుంటే జైలుశిక్ష పొడిగింపు

శృంగవరపుకోట: తన ఖాతాలో నగదు లేకుండా చెక్ ఇచ్చి మోసం చేసిన కేసులో ముద్దాయికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఎస్.కోట మున్సిప్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎస్.వాణి గురువారం తీర్పు ఇచ్చారు. ఈ కేసుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఎస్.కోట మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన అల్లు శ్రీనివాసరావు దగ్గర జామి మండలంలోని కుమరాం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు జాగరపు వెంకట అప్పారావు రూ.2లక్షలు అప్పు తీసుకున్నారు. తర్వాత అప్పు తీర్చే క్రమంలో శ్రీనివాసరావుకు రూ.1.50లక్షల చెక్కు ఇచ్చాడు. శ్రీనివాసరావు ఆ చెక్కును బ్యాంక్‌లో జమ చేయగా, వెంకట అప్పారావు ఖాతాలో నగదు లేదంటూ బ్యాంకర్లు తిరస్కరించారు. దీంతో బాధితుడు శ్రీనివాసరావు న్యాయవాది బి.త్రిమూర్తులు ద్వారా కోర్టును ఆశ్రయించాడు. ఈ కేసులో వాదోపవాదాలు విన్న అనంతరం చెల్లని చెక్కు ఇచ్చి మోసం చేసినట్లు వెంకటఅప్పారావును ముద్దాయిగా నిర్ధారించి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి ఎస్.వాణి తీర్పు ఇచ్చారు. నెలరోజుల్లో శ్రీనివాసరావుకు ఇవ్వాల్సిన అసలు, 9శాతం వడ్డీ కలిపి చెల్లించాలని, లేకుంటే మరో ఆరునెలలు అధికంగా జైలుశిక్ష అనుభవించాల్సి వస్తుందని తీర్పులో పేర్కొన్నట్లు కోర్టు వర్గాలు తెలిపాయి.

వీధికుక్కల దాడిలో ఆవు దూడల మృతి


కుక్కలదాడిలో మృతిచెందిన ఆవుదూడ

మెరకముడిదాం: మండల కేంద్రం మెరకముడిదాంలో గురువారం వీధికుక్కల దాడిలో రెండు ఆవుదూడలు మృతిచెందాయి. మెరకముడిదాం గ్రామానికి చెందిన బంటుపల్లివెంకటేశ్వరరావు, గొర్లెనారాయణరావులకు చెందిన రెండు ఆవుదూడలను వీధికుక్కలు వెంటాడి చీరేశాయి. వీధి కుక్కలు చికెన్ సెంటర్ల వద్ద వారు పారేసిన వ్యర్థాలకు అలవాటు పడి అప్పుడప్పుడు ఇలా ఆవులు, దూడలపై దాడులు చేసి చీరేస్తున్నాయని బాధిత యజమానులు చెబుతున్నారు. వేలల్లో తమకు లాభాన్ని చేకూర్చుతాయనుకున్న ఆవుదూడలు వీధి కుక్కలు పాలవడంతో నష్టపోయామని లబోదిబో మంటున్నారు. అధికారులు స్పందించి వీధి కుక్కలను నిర్మూలించే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆక్రమణలు చేస్తే సహించేది లేదు

విజయనగరం టౌన్: దేవాదాయ ధర్మాదాయశాఖకు చెందిన విజయనగరం లోని కోట వద్దనున్న శ్రీ విద్యార్థి అలియాస్ నీలాయమ్మ సత్రానికి సంబంధించిన స్థలంలో ఆక్రమణలకు పాల్పడితే సహించేది లేదని, చట్ట పరంగా చర్యలు చేపడతామని దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ అన్నపూర్ణ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆమె మాట్లాడుతూ ఇటీవల కొందరు వ్యక్తులు టౌన్ సర్వే నంబర్ 509లో ఉన్న ఖాళీస్థలాన్ని ఆక్రమించుకునేందుకు సిమెంట్ పోల్స్‌ను, సిమెంట్ పలకలతో ప్రహరీని అనధికారికంగా నిర్మించేందుకు చేసిన ప్రయత్నాన్ని అడ్డుకున్నామన్నారు. ఈ మేరకు కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఎం.దీపికలను కలిసి సమస్య విన్నవించినట్లు తెలిపారు. సత్రం స్థలంలో ఉన్న పోల్స్‌ను తొలగించి, అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశామని చెప్పారు. దేవాదాయశాఖకు చెందిన స్థలాలు ఆక్రమించే వ్యక్తులపై చట్టం ప్రకారం చర్యలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓ వంశీలక్ష్మి, జిల్లా పోలీస్ అధికారులు, దేవాదాయశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


నీలాయమ్మ సత్రం వద్ద దేవాదాయశాఖ అధికారులు పాతిన హెచ్చరిక బోర్డు

ఫిష్ ఆంధ్రా షాపుల్లో గిరాకీ

- జిల్లాలో 72 అవుట్‌లెట్‌లు
- గణనీయంగా పెరిగిన లైవ్‌ఫిష్, తాజా ఫిష్ అమ్మకాలు

పూసపాటిరేగ: మత్స్యకారులకు అండగా ఉంటూ మత్స్యసంపదను విలువ ఆధారిత ఉత్పత్తిగా మార్చడానికి రాష్ట్రప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకుంది. దీంతో వేలాది మంది మత్స్యకారుల జీవనోపాధి మెరుగు పడింది. ఆహారంలో కీలకపోషకాలు ఉన్న చేపల ఉత్పత్తి అమ్మకాలకు మంచి రోజులు వచ్చాయి. ఫిష్ ఆంధ్రా నినాదంతో విజయనగరం జిల్లాలో 72 మినీ అవుట్‌లెట్లు ఏర్పాటు చేశారు.

జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో సముద్రతీరం 27 కిలోమీటర్లు ఉంది. తీరం వెంబడి 19 మత్స్యకార గ్రామాల్లో సుమారు 20 వేల మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. ప్రత్యక్షంగా 6 వేలు, పరోక్షంగా 14 వేల మంది మత్స్యకారులు మత్స్యసంపదపైనే ఆధారపడి ఉన్నారు. వేట చేస్తున్న 3798 మంది మత్స్యకారులకు గుర్తింపు కార్డులను ఇప్పటికే ప్రభుత్వం జారీ చేయడంతో వేట నిషేధ సమయానికి మత్స్యకార భరోసా మంజూరుకు ప్రతిపాదనలు చేశారు. సముద్రం నుంచి వచ్చిన మత్స్యసంపద ఫిష్ ఆంధ్రా అవుట్‌లెట్ యూనిట్ల ద్వారా అమ్మకాలు జరుగుతున్నాయి. జిల్లాలో 72 మినీఫిష్ ఆంధ్రా అవుట్‌లెట్‌ల ద్వారా నిత్యం చేపలు విక్రయిస్తున్నారు. రిజర్వాయర్, చెరువులో లభ్యమయ్యే చేపల్లో అధికంగా లైవ్‌ఫిష్‌లు ఉండడంతో వాటికి గిరాకీ బాగా పెరగడంతో అమ్మకాల్లో వృద్ధి బాగా పెరిగింది.

మత్స్యకారులకు మేలు

ఫిష్ ఆంధ్రా అవుట్‌లెట్‌ల ద్వారా అమ్మకాలను గణనీయంగా పెంచారు. ఫిష్ ఆంధ్రా యూనిట్లు ఏర్పాటు చేయడంతో చేపల వేట చేసే మత్స్యకారులకు మేలు జరుగుతోంది. రాష్ట్రం, దేశం, విదేశాలకు ఎగుమతి అయ్యే మత్స్యసంపద మార్కెటింగ్‌కు సంబంధించి మరిన్ని వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో మత్స్యకారులు వేట చేయగా వచ్చిన మత్స్యసంపదకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో ఇబ్బందులు పడేవారు. తాజాగా వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో మత్స్యకారులు వేట చేసిన మత్స్యసంపద అమ్మకాలకు మంచి మార్కెట్ కల్పించడానికి ఫిష్ ఆంధ్రాషాపులు ఏర్పాటు చేయడంతో వారి జీవితాలు మెరుగుపడ్డాయి. దీంతో మత్స్యకారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

జాబ్‌మేళాకు స్పందన


ఇంటర్వ్యూకు హాజరైన విద్యార్థులు

రాజాం సిటీ: స్థానిక జీసీఎస్ఆర్ కళాశాలలో టెక్‌బీ మహేంద్ర సంస్థ నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఇంటర్మీడియట్ అర్హతతో చేపట్టిన ఈ మేళాకు రాజాం పరిసర ప్రాంత కళాశాలలకు చెందిన 160 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏపీఐటీఏ సీఈఓ డీవీ రామకోటి రెడ్డి, ఆ సంస్థ సభ్యులు ఫారాజ్, సాయికిరణ్, వంశీ, శ్రీనివాసరాజు ఇంటర్వ్యూలు చేపట్టారు. ఈ ఇంటర్వ్యూలో 69 మంది విద్యార్థులు ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పురుషోత్తం, సీహెచ్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.


అస్వస్థతతో గుర్తు తెలియని వ్యక్తి మృతి


ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

దత్తిరాజేరు: అస్వస్థతకు గురైన గుర్తు తెలియని వ్యక్తి ఎస్.బూర్జవలస గ్రామంలో మృతి మృతిచెందినట్లు ఎస్సై లక్ష్మీప్రసన్నకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సమీపంలో ఉన్న చవక చెరువు వద్ద గుర్తు తెలియని వ్యక్తి కొన ఊపిరితో ఉండడాన్ని అటుగా వెళ్తున్న ఉపాధి హామీ వేతనదారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు 108 వాహనంలో గజపతినగరం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వాస్పత్రిలో ఉంచామని, ఆచూకీ తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని ఎస్సై లక్ష్మీ ప్రసన్న కుమార్ కోరారు.

పోషకాల రేడు.. నేరేడు

- ప్రస్తుత సీజన్‌లో విరివిగా లభ్యం
- ఆరోగ్య ఫల ప్రదాయినిగా గుర్తింపు


బహిరంగ మార్కెట్‌లో లభిస్తున్న నేరేడు పండ్లు

పాలకొండ రూరల్: ప్రకృతి ప్రసాదించే పండ్లజాతుల్లో ఒకటైన ఆరోగ్య ఫల ప్రదానియగా పిలిచే నేరేడు పండును సక్రమంగా వినియోగిస్తే ఆరోగ్యానికి సంపూర్ణంగా మేలు చేయడంతో పాటు శరీరంలో ఏర్పడే అనేక అనారోగ్య సమస్యలను, రుగ్మతలను దూరం చేస్తుంది. రుచిలో మేటిగా ఉండే నేరేడు పండు మాత్రమే కాకుండా ఆకులు, చెట్టు బెరడు కూడా శరీరానికి చక్కని మేలు చేస్తాయి. నేరేడుపండులో అత్యధిక పోషకాలు ఉన్న నేపథ్యంలో పండు రూపంలోనే కాకుండా ఆరోగ్య పానీయాలు, జామ్‌లు, ఐస్‌క్రీమ్ తయారు చేసుకోవచ్చు. నేరేడు కాయలను వెనిగర్, వైన్ తయారీలో ఉపయోగిస్తారు. నేరేడుపండ్లు కోయడం చాలా శ్రమతో కూడుకున్నది కావడంతో ధర కూడా అధికంగానే ఉంటుంది. రైతు దగ్గర దళారులు కేజీ రూ.80కి కొనుగోలు చేసి వ్యాపారులకు రూ.150కి విక్రయిస్తారు. వినియోగదారుల చేతికొచ్చేసరికి ధర రూ.200 పలుకుతుంది. అందులో నాణ్యమైన నేరేడుపండ్లను వేరు చేసి ఇంకా లాభసాటి ధరకు విక్రయిస్తారు. సంప్రదాయ ఆయుర్వేద వైద్య విధాన పరంగా అనేక ఔషధ లక్షణాలు కలిగి ఉన్న నేరేడుకు అత్యంత ప్రాముఖ్యం ఉంది. ప్రస్తుత సీజన్‌లో రోజుకు ఒక్కటి చొప్పున నేరేడు పండు తింటే వ్యాధులు, రోగకారక సమస్యలకు దూరంగా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు.

నేరేడు పండ్లతో ప్రయోజనాలు

- నేరేడు పండ్లలో ఐరన్, కాల్షియం, పొటాషియంతో పాటు ఎ.సి విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. వీటి వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షణ కలుగుతుంది.
- మూత్ర సమస్యల నియంత్రణతో పాటు మధుమేహం అదుపులో ఉంటుంది. కిడ్నీలను శుభ్రపరుస్తుంది. మూత్రాశయంలో ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. కాలేయం పనితీరును మెరుగుపర్చడంతో పాటు శుభ్రపరుస్తుంది.
- నేరేడు పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు గుండెకు, మెదడుకు దివ్యౌషధంగా పనిచేస్తాయి.
- దంతాలు, చిగుళ్లు ఆరోగ్యకరంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తస్రావం తగ్గుతుంది. నోట్లో చెడు బ్యాక్టీరియా నశించి దుర్వాసన రాకుండా చేస్తుంది.
- కడుపులో పేరుకుపోయిన మలినాలను బయటకు పోవడానికి, పేగుల్లో చుట్టుకుపోయిన వెంట్రుకలను కరిగించడానికి నేరేడు పండు దోహదపడుతుంది.
- నేరేడుపండులో విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారిస్తాయి. అన్ని వేళల్లో ఆరోగ్యానికి నేరేడు పండు భరోసా కల్పిస్తుంది.

తినడంలో నియంత్రణ లేకుంటే..

- నేరేడుపండ్లు తినడంలో నియంత్రణ లేకుంటే దుష్ఫలితాలు సంభవించవచ్చు.
- వగరు రుచి కలిగిన నాణ్యత లేని నేరేడుపండ్లు భుజిస్తే గొంతు నొప్పి సంభవించవచ్చు. సీజన్ మారే సమయంతో ఈ పండ్లను మితంగా తినాలి.
- ఉబ్బసం ఉన్నవారు ఈ పండ్లను ఎక్కువగా తినరాదు. దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలు వచ్చే ఆస్కారం ఉంది.
- నేరేడుపండ్లలో ఉండే అత్యధిక లవణాలు, పోషకాల వల్ల బలహీనమైన జీర్ణవ్యవస్థ కలిగిన వారికి తరచూ కడుపునొప్పి సంభవించే అవకాశం ఉంది.